సాక్షి
విశాఖపట్నం
గురువారం । 23 । జనవరి । 2025



కంటి ఆస్పత్రిలో పిల్లలకు ఓపీ, ప్రత్యేక వార్డు 8లో



వనాల ఏర్పాటుతో తీరప్రాంత పరిరక్షణ 8లో



ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు 8లో

కూటమి ట్యాక్స్

నెలకు రూ. 2 కోట్లు



మార్టూరు క్వారీలో మైనింగ్ కార్యకలాపాలు

'అనకాపల్లి' మైనింగ్‌లో వసూళ్ల పర్వం

- చక్కర్లు కొడుతున్న లారీలు రోజుకు 1000
- ట్రిప్పునకు రూ.22 వేల వంతున వసూళ్లు
- అందులో ఎంపీ రమేష్ లారీలకు మినహాయింపు
- 32 టన్నుల లారీలో 50 టన్నుల బోల్డర్లు
- ఒక్కో లారీలో 14–18 టన్నుల మేర అధిక లోడు
- అధికార, అనధికారిక క్వారీల నుంచి అడ్డగోలు వసూళ్లు
- పట్టించుకోని వివిధ శాఖల అధికారులు

రోజుకు 1000 ట్రిప్పులు....
ఇందులో 150 పోను...
మిగిలిన 850 ట్రిప్పులకు
రూ.22 వేల చొప్పన
మొత్తం రూ.1.87 కోట్లు!!

ఇవేం లెక్కలు అనుకుంటున్నారా.... అనకాపల్లి నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ వ్యవహారంలో కూటమి నేతలు చేస్తున్న నెలవారీ వసూళ్ల లెక్కలివి. మైనింగ్ శాఖతో పాటు రవాణా, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు నెలనెలా ముడుపులు ముడుతున్నాయనీ, అందుకే అనేక అవకతవకలు జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

కొత్త ప్రభుత్వంలో సరికొత్త టిప్పర్లు.. ఎక్కడా తేడా రాకుండా ఎంచక్కా వాటాలు.. ఎవరూ నోరు తెరవకుండా ఎక్కడికక్కడ ఏర్పాట్లు.. కూటమి ప్రభుత్వంలో మైనింగ్ దందా ఎంత పకడ్బందీగా సాగిపోతోందో చూడండి.. అనకాపల్లి నియోజకవర్గంలో ఉన్న వివిధ క్వారీల ద్వారా రోజుకు 1,000 ట్రిప్పుల్లో బండరాళ్లు తరలిపోతున్నాయి. వివిధ అధికార, అనధికార క్వారీల నుంచి మునగపాక మీదుగా రోడ్లపై భారీ శబ్దాలు చేస్తూ రాంబిల్లిలోని నావికాదళ పనుల వరకూ ప్రతి రోజూ చక్కర్లు కొడుతున్నాయి. 32–36 టన్నుల సామర్థ్యం కలిగిన టిప్పర్లలో ఏకంగా 50 టన్నుల మేరకు భారీ బండరాళ్లు వేసుకుని తిరుగుతున్నా ఈ టిప్పర్ల వైపు అటు మైనింగ్ అధికారులు కానీ, ఇటు రవాణాశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు కానీ కనీసం కన్నెత్తి చూడటం లేదు. ఇందుకు కారణం ప్రతి నెలా ఒక్కో ట్రిప్పునకు రూ.22 వేలు చొప్పున కూటమి నేతలు ట్యాక్స్ వసూలు చేస్తుండటమే. ఇందులో అనకాపల్లి ఎంపీకి చెందిన సీఎం రమేష్ ట్రిప్పులను మినహాయించి మిగిలిన 850 ట్రిప్పులు తోలుతున్న వివిధ సంస్థలు, వ్యక్తుల నుంచి నెలకు ఠంచనుగా రూ.22 వేల మేర వసూలు చేస్తున్నారు. ఈ లెక్కలన్నీ అనకాపల్లికి చెందిన కూటమి నేత బంధువు చూస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధిక లోడుతో వస్తున్న ఈ వాహనాల రాకపోకలపై ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో నెలవారీగా వసూలవుతున్న మొత్తం రూ.1.87 కోట్లలో కూటమి నేతలతో పాటు మైనింగ్, రవాణా, పోలీసు, రెవెన్యూ అధికారులకూ భారీగా వాటాలు అందుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



దగ్గరుండి మరీ పర్యవేక్షణ..!

అనకాపల్లి నియోజకవర్గంలో 20 క్వారీలకు అధికారికంగా అనుమతి ఉంది. మరో 30 అనధికారిక క్వారీలను కలుపుకుని మొత్తం 50 క్వారీల నుంచి ప్రతి రోజూ సగటున 1,000 ట్రిప్పుల బండరాళ్లు తరలిపోతున్నాయి. రాంబిల్లి వద్ద నావికాదళానికి సంబంధించి అణు జలాంతర్గాముల కోసం ప్రత్యేకంగా ఐఎన్ఎస్ వర్ష పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సముద్రంలో కొన్ని కిలోమీటర్ల మేర దారిని నిర్మించాల్సి ఉంటోంది. ఇందుకోసం భారీ బండరాళ్లతో నింపే పనులు జరుగుతున్నాయి. వీటి కోసం అవసరమైన బండరాళ్లను ప్రధానంగా అనకాపల్లి నియోజకవర్గం నుంచి తరలిస్తున్నారు. ఇందుకుగానూ అనకాపల్లి నియోజకవర్గంలోని జంగాలపాలెం, మార్టూరు తదితర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున బండరాళ్లను తీసుకువెళుతున్నారు. ప్రధాన కాంట్రాక్టరుకు అవసరమైన బండరాళ్లను సరఫరా చేసే బాధ్యతలను పలువురు సబ్ కాంట్రాక్టు కింద తీసుకున్నారు. ఇందులో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌తో సహా పలువురు స్థానిక కాంట్రాక్టర్లు, కూటమి నేతలు ఉన్నారు. వీరికి చెందిన భారీ టిప్పర్లకు బండరాళ్లను ఎత్తుతున్నారు. నిబంధనల మేరకు ఆయా టిప్పర్ల సామర్థ్యాన్ని బట్టి 32 నుంచి 36 టన్నుల వరకు మాత్రమే తరలించాల్సి ఉంటుంది. అయితే, వీటిలో 50 టన్నుల మేరకు బండరాళ్లను తరలిస్తున్నారు. ఈ అదనపు లోడును చూసీ చూడనట్టుగా ఉండేందుకుగానూ నెలకు ట్రిప్పునకు రూ.22 వేలు చొప్పున వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతి రోజూ ఎన్ని ట్రిప్పులు వెళుతున్నాయనే లెక్కలను చూసేందుకు కూటమి నేత బంధువు దగ్గరుండీ మరీ పర్యవేక్షిస్తున్నట్టు తెలుస్తోంది. ఆయనకు సంబంధించిన వ్యక్తులను ఆయా క్వారీల వద్ద ఉంచి... లెక్కలు కడుతున్నారు. లెక్కలను చూసుకుని ప్రతి నెలా వసూళ్లకు తెగబడుతున్నట్టు తెలుస్తోంది.

అందరికీ వాటాలే..!

ఈ అనధికార అక్రమ మైనింగ్ వ్యవహారంలో కూటమి నేతలతో పాటు అధికారులకు కూడా ప్రతి నెలా వాటాలు అందుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధిక లోడుతో వెళుతున్న వాహనాలను చూసీ చూడనట్టుగా ఉండేందుకు వీలుగా రవాణాశాఖ అధికారులకు ప్రతి నెలా మామూళ్లు ముట్టజెబుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఇక అనధికారిక క్వారీల్లో జరుగుతున్న మైనింగ్‌ను పట్టించుకోకుండా ఉండేందుకుగానూ మైనింగ్ అధికారులకూ భారీగా ముడుతోందన్న విమర్శలున్నాయి. అక్రమ మైనింగ్‌తో పాటు అధిక లోడుతో భారీగా రాయల్టీ రూపంలో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. అయినప్పటికీ వీరికి చీమ కుట్టినట్టు కూడా ఉండటం లేదు. ఇక మైనింగ్ విజిలెన్స్ అధికారులు కనీసం ఒక్కటంటే ఒక్కసారి కూడా దాడులు చేసి అక్రమ మైనింగ్‌ను నిలిపివేసేందుకు గత 7 నెలల కాలంలో ప్రయత్నించలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. మరోవైపు స్థానిక పోలీసు, రెవెన్యూ, విజిలెన్స్ ఇలా అన్ని విభాగాల అధికారులకు వాటాల లెక్కన పంచుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారాలన్నీ కూటమి నేత బంధువు దగ్గరుండీ మరీ చూస్తున్నట్టు తెలుస్తోంది. ఎవరి వాటా వారికి ఇచ్చిన తర్వాత మిగిలిన భారీ మొత్తాన్ని సదరు కూటమి నేత బంధువు జేబులోకి వెళుతోంది.

ఏకంగా కొత్త టిప్పర్లు!





ఈ వ్యవహారాలు సజావుగా సాగడంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కీలకపాత్ర పోషిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. మరోవైపు ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.... గత కొద్ది రోజులుగా కొత్త టిప్పర్లు ఈ మైనింగ్ క్వారీల నుంచి రాంబిల్లి వరకూ హోరెత్తిస్తున్నాయి. కేవలం ఈ బండరాళ్లను సరఫరా చేసేందుకే కొత్తగా సీఎం రమేష్‌తో పాటు ఆయనకు సంబంధించిన వ్యక్తులు 100 వరకూ కొత్త టిప్పర్లను కొనుగోలు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. మరోవైపు బండరాళ్లను తీసుకెళుతున్న పలు ఇతర సంస్థలకు చెందిన భారీ టిప్పర్లలో కొన్నింటికి నెంబరు ప్లేట్లు కూడా లేకపోవడం గమనార్హం. అయినప్పటికీ రవాణాశాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక ఇష్టారాజ్యంగా మైనింగ్ చేపడుతూ.... ఓపెన్ బ్లాస్టింగ్ ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఇంత జరుగుతున్నప్పటికీ అటవీ, పర్యావరణశాఖ అధికారులు కూడా పట్టించుకోకపోవడం వెనుక కూటమి నేతల బలమైన ఒత్తిళ్లే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యూస్‌రీల్

రేపు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 24న నిర్వహించనున్నారు. నగర మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల స్థాయీ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశంలో 110 అజెండా అంశాలపై సభ్యులు చర్చించనున్నారు. వీటిలో ప్రధానంగా పలు వార్డుల్లో అభివృద్ధి పనులు, సర్వీస్ అంశాలు, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల పనికాలం పొడిగింపు తదితర అంశాలు పొందుపరిచారు.

29న అప్పన్న తెప్పోత్సవం

సింహాచలం : పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని ఈనెల 29న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. కొండ దిగువ వరాహ పుష్కరిణిలో సాయంత్రం 5 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆరోజు సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సింహగిరిపై స్వామివారి మూలవిరాట్ దర్శనాలు లభిస్తాయని తెలిపారు.

రిసోర్స్ పర్సన్ పోస్టులకు దరఖాస్తులు

ఎంవీపీ కాలనీ: డీఆర్‌డీఏ, ఉపాధి కల్పన, వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలో రిసోర్స్ పర్సన్‌గా సేవలు అందించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. డిగ్రీ, కంప్యూటర్ నైపుణ్యం కలిగి, నవంబర్ 1, 2024 నాటికి 21 ఏళ్లు నిండి, 30 ఏళ్ల లోపు వయసున్నవారు అర్హులు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు మండల సమాఖ్య వెలుగు కార్యాలయానికి వెళ్లి అక్కడ అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్ లింక్ ద్వారా ఈ నెల 24లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

జీవీఎంసీ మీ సేవల్ని మర్చిపోదు

- కమిషనర్ సంపత్‌కుమార్ వీడ్కోలు సభలో మేయర్ హరి వెంకట కుమారి
- సీడీఎంఏగా వెళ్తున్నా జీవీఎంసీకే ప్రాధాన్యం : సంపత్‌కుమార్



కమిషనర్‌ను సత్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్లు బాణాల శ్రీనివాసరావు, పీలా శ్రీనివాస్, గంగారామ్, స్టాలిన్, కవిత, భీశెట్టి వసంతలక్ష్మి

డాబాగార్డెన్స్: పరిపాలనలో అనతి కాలంలోనే నగర ప్రజల మన్ననలందుకున్న జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌ను జీవీఎంసీ పరిధి ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. సీడీఎంఏగా బదిలీపై వెళ్తున్న సంపత్‌కుమార్‌కు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు, పలువురు కార్పొరేటర్లు, ఉన్నతాధికారులు, సిబ్బంది కలిసి ఆత్మీయ సత్కారంతో ఘనంగా వీడ్కోలు పలికారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అన్ని విభాగాలను సమన్వయపరుస్తూ జీవీఎంసీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేశారని కొనియాడారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ విశాఖ నగరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నెంబర్ వన్ స్థానం సాధించేందుకు సీడీఎంఏగా సపోర్ట్ చేయాలని కోరారు. జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మిషన్ డైరెక్టర్‌గా పని చేసిన అనుభవంతో నగరాభివృద్ధికి ఆయన చేసిన కృషిని మర్చిపోలేమన్నారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ గంగారావ్, సీపీఐ ఫ్లోర్‌లీడర్ ఏజే స్టాలిన్ జీవీఎంసీ కమిషనర్‌గా సంపత్‌కుమార్ అందించిన సేవల్ని కొనియాడారు.

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీలో కమిషనర్‌గా పని చేసిన ఆరు నెలల కాలం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. జీవీఎంసీ ఆదాయం పెంపు, రూ.500 కోట్లతో నీటిపైప్‌లైన్ల మంజూరు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు తన వంతు కృషి చేసినట్లు పేర్కొన్నారు. కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా మెస్‌లు ఏర్పాటు చేయాలని ప్రధాన ఇంజనీర్‌కు సూచించారు. 1,150 ఖాళీ స్థలాలను సంరక్షించే దిశగా పార్కులు అభివృద్ధి చేస్తే విశాఖ పోర్టు ట్రస్ట్ ఆర్థిక సహకారం అందిస్తుందని డీడీహెచ్ దామోదరరావుకు తెలిపారు. సీడీఎంఏకి వెళ్తున్నా జీవీఎంసీకి అధిక ప్రాధాన్యత ఇస్తానని భరోసానిచ్చారు.

పర్యాటక పాలసీలో లోటుపాట్లు సవరిస్తాం

ఏపీ టూరిజం కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి



హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చిస్తున్న ఆమ్రపాలి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన టూరిజం పాలసీలో లోటుపాట్లు పరిశీలించి.. అన్ని వర్గాల సలహాలు సూచనలు తీసుకుని సవరణలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ వీసీ, ఎండీ కాటా ఆమ్రపాలీ స్పష్టం చేశారు. మూడు రోజుల విశాఖ పర్యటనలో భాగంగా.. ఆమె వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం ఫోరం ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. ఏపీ టూరిజం ఫోరం అధ్యక్షుడు కె.విజయ్‌మోహన్, కార్యదర్శి ఎం.వి. పవన్ కార్తీక్ పాలసీలో హోటల్స్ రంగానికి ఇచ్చిన ప్రాధాన్యం గురించి ఆమెకు వివరించారు. సింగిల్ విండో పాలసీపై విధివిధానాలు జారీ చేయాలని కోరారు. పాలసీలో భాగంగా పర్యాటక రంగానికి ప్రకటించిన ప్రోత్సాహకాలు ఎప్పటి నుంచి వస్తాయనే దానిపై స్పష్టత లేదనీ.. అదేవిధంగా.. కొత్త హోటల్స్‌కు రాయితీలు ప్రకటించారనీ.. ప్రస్తుతం నడుస్తున్న హోటల్స్ గురించి కూడా పాలసీలో జోడించాలని కోరారు. ఉమ్మడి విశాఖతో పాటు ఏపీలో పర్యాటక అభివృద్ధి అవకాశాల గురించి ఆమ్రపాలి ఫోరం ప్రతినిధుల్ని అడిగి తెలుసుకున్నారు. ఉత్తరాంధ్రలో పర్యాటకాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఫోరం ఉపాధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. ఇక వీఎంఆర్‌డీఏ చేపడుతున్న టూరిజం ప్రాజెక్టులపై ఆమ్రపాలి నేడు సమీక్ష నిర్వహించనున్నారు.

26న టూరిజం రీజనల్ సదస్సు

పర్యాటక అభివృద్ధి, ప్రాజెక్టులు, పొరుగు రాష్ట్రాల టూరిజం కార్పొరేషన్లతో ఒప్పందాలు.. మొదలైన అంశాలపై చర్చించేందుకు ఈనెల 26న పర్యాటక ప్రాంతీయ సదస్సు జరగనుంది. నగరంలోని నోవోటెల్ హోటల్‌లో రీజనల్ సదస్సుకు ఏర్పాట్లు చేస్తున్నామని టూరిజం ఇన్‌చార్జ్ ఆర్‌డీ రమణ ప్రసాద్ తెలిపారు.

విశాఖ చేరుకున్న 'షార్జా' బాధితులు

- పోలీస్ కమిషనర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు
- సీపీ స్పందనతో సురక్షితంగా విశాఖకు



షార్జా నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరిన యువకులతో సీపీ శంఖబ్రత బాగ్చి, పోలీసులు

గోపాలపట్నం: ఉద్యోగాల కోసం షార్జా వెళ్లి, అక్కడ అనుకున్న ఉద్యోగం రాకపోవడంతో ఇబ్బందుల్లో పడిన బాధితులు, విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చొరవతో సురక్షితంగా నగరానికి చేరుకున్నారు. బుధవారం విశాఖ విమానాశ్రయంలో సీపీతో కలిసి బాధితులు మీడియాకు తెలిపిన వివరాలు.. గాజువాక ఆటోనగర్‌లోని మణికంఠ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వెల్డింగ్ శిక్షణ ఇచ్చి, దుబాయ్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్న ప్రకటన చూసి అనకాపల్లి జిల్లా నాతవరం మండలం పీకే గూడేనికి చెందిన పోలుపర్తి లక్ష్మీనారాయణ, గార రాజేష్, పైలా రామస్వామి, శ్రీకాకుళం జిల్లా కంచిలికి చెందిన కాళ్ల వెంకటరావు, విశాఖలోని పెదగంట్యాడ సీకువానిపాలేనికి చెందిన గెద్దాడ లోకేష్‌లు ఆ సంస్థను సంప్రదించారు. ఏజెంట్లు దుర్గాప్రసాద్ అలియాస్ ప్రసాద్, చందులు మణికంఠ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోనే ఇంటర్వ్యూలు, మెడికల్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఎంపికైన వీరికి విశాఖ వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వెల్డింగ్ శిక్షణ ఇచ్చారు. అనంతరం గతేడాది నవంబర్ 12న షార్జాలోని క్వాలిటీ ఇంటర్నేషనల్ కంపెనీలో వెల్డర్ ఉద్యోగాలకు పంపారు. అక్కడికి చేరాక వీరికి 6జీ వెల్డింగ్ కాకుండా 3జీ వెల్డింగ్ ఇచ్చి పరీక్షించారు. అందులో అర్హత పొందకపోవడంతో వెల్డర్లుగా కాకుండా.. లేబర్ ఉద్యోగాలిచ్చారు. వీరంతా టూరిస్ట్ వీసాతో వెళ్లడం వల్ల, కాల పరిమితి ముగిస్తే ఇబ్బందుల్లో పడతామనే ఆందోళనతో ఏజెంట్లను సంప్రదించారు. ఏజెంట్లు సకాలంలో స్పందించక పోవడంతో, విశాఖ నగర పోలీస్ కమిషనర్ నంబర్ (7995095799)లో తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన సీపీ ఇమిగ్రేషన్ అధికారులతో చర్చించి, వెస్ట్, గాజువాక పోలీసుల సహకారంతో ఏజెంట్ల ద్వారా ఈ ఐదుగురిని విశాఖకు తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. నగరానికి చేరుకున్న వీరు సీపీ శంఖబ్రత బాగ్చికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏజెంట్ల వివరాలు సేకరిస్తున్నాం

ఏజెంట్ల ద్వారా ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లి మోసపోకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ శంఖబ్రత బాగ్చి మీడియాకు తెలిపారు. విశాఖ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏజెంట్ల వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఇమిగ్రేషన్ అధికారుల సహకారాన్ని తీసుకుంటామన్నారు. బాధితులు విశాఖ వచ్చేందుకు అయిన ఫ్లైట్ చార్జీలు, ఏజెంట్లకు ఇచ్చిన నగదు వారికి తిరిగి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి ఇబ్బందులకు గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

నేషనల్ గేమ్స్ ట్రయథ్లాన్ కోచ్‌గా నాగేశ్వరరావు



మద్దిలపాలెం: ఉత్తరాఖండ్‌లో జరగనున్న నేషనల్ గేమ్స్‌కు ట్రయథ్లాన్ కోచ్‌గా విశాఖ జిల్లా ట్రయథ్లాన్ కార్యదర్శి చెల్లుబోయిన నాగేశ్వర రావు ఎంపికయ్యారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 14 వరకు నేషనల్ గేమ్స్ జరగనున్నాయి. ఈ పోటీలకు ట్రయథ్లాన్ కోచ్‌గా ఎంపికైన నాగేశ్వరరావును మలేరియా విభాగం జిల్లా అధికారి ఎం.తులసి, సబ్ యూనిట్ అధికారులు నగేష్ పట్నాయిక్, వెంకటేష్, కనకమ్మ అభినందించారు.

కొనసాగుతున్న కానిస్టేబుళ్ల నియామక పరీక్షలు



పరుగులో పాల్గొన్న అభ్యర్థులు

ఆరిలోవ: ఏపీ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో చేపడుతున్న కానిస్టేబుళ్ల నియామక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఈ నియామకాల కోసం అభ్యర్థులకు శరీర దారుఢ్య పరీక్షలు కై లాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో జరుగుతున్న విషయం తెలిసిందే. ఇక్కడ బుధవారం జరిగిన పోటీలకు 600 మంది అభ్యర్థులకుగాను 408 మంది హాజరయ్యారు. వారికి పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించినట్లు ఎస్పీ సిన్హా తెలిపారు. ఆయా పరీక్షల్లో ప్రతిభ కనబరిచి, తుది రాత పరీక్షకు 300 మంది ఎంపికైనట్లు వెల్లడించారు.

25న దివ్యాంగ యువతకు జాబ్ మేళా

మధురవాడ: బక్కన్నపాలెంలోని ఆంధ్ర ప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ, శిక్షణ మరియు ఉత్పత్తి కేంద్రంలో యూత్ 4 జాబ్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ మాధవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖ జిల్లాకు చెందిన దివ్యాంగ యువతకు వివిధ కంపెనీల్లో ఉద్యోగాల కల్పన కోసం ఈ ఇంటర్వ్యూలు జరపనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగి, టెన్త్ పాసైన 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్కులైన దివ్యాంగులు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 73964 24319 నంబర్లో సంప్రదించాల్సిందిగా పీడీ మాధవి కోరారు.

జాతీయ స్థాయి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్: సేవా భూషణ్, విద్యాభూషణ్ జాతీయ స్థాయి పురస్కారాలకు–2025 దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సర్వేజనా సుఖినో భవంతు వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఇ.ఎస్.ఎస్.నారాయణ మాస్టారు పేర్కొన్నారు. ఫిబ్రవరి 9న సంస్థ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, యోగా, మెడిటేషన్, సంగీత, నృత్య గురువులు, కళాకారులు, కవులు,రచయితలు,క్రీడాకారులకు పురస్కారాల తో సత్కరించనున్నట్టు చెప్పారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్న వారు దరఖాస్తులను ఈ నెల 31లోగా సర్వేజనా సుఖినో భవంతు, డోరు నెంబరు 1–20–164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి, సికింద్రాబాద్–15 అడ్రస్‌కు పంపించాలని తెలిపారు. వివరాలకు 9652347207లో సంప్రదించాలన్నారు.

స్టాఫ్‌నర్స్ పోస్టు @ రూ.3 లక్షలు



స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ కూటమి నేతలకు కాసులు కురిపిస్తోంది. ఉత్తరాంధ్ర పరిధిలోని 106 పోస్టులకు 8,309 మంది దరఖాస్తు చేయడంతో సిఫార్సులు, పైరవీలు జోరందుకున్నాయి. ఇందుకు ఒక్కో పోస్టుకు రూ.3 లక్షలు వసూలు చేస్తున్నట్టు సమాచారం. కూటమి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎవరికి వారు, తమ వారికే పోస్టులు దక్కాలంటూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక అధికారులు తలలుపట్టుకుంటున్నారు.

- 106 పోస్టులకు 8,309 మంది దరఖాస్తు
- కొంత మందికి ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు
- ఒక్కో పోస్టుకు రూ.3 లక్షలు డిమాండ్?
- వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీపై తీవ్ర ఒత్తిడి
- సిఫార్సులు ఉంటేనే ఉద్యోగాలు

మహారాణిపేట: స్టాఫ్‌నర్స్ పోస్టులకు గిరాకీ రోజురోజుకూ పెరుగుతోంది. ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో పోస్టు ధర కూడా అదే స్థాయికి చేరుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల భర్తీలో మెరిట్‌ను చూస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సిఫార్సు లేఖలకు పెద్దపీట వేస్తున్నారు. ఇది వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. మెరిట్ విషయాన్ని పక్కనపెడితే.. ఎవరి సిఫార్సు లేఖలను ఆమోదించాలో తెలియక సతమతమవుతున్నారు.

106 పోస్టులకు 8,309 మంది పోటీ

ఉత్తరాంధ్రలోని ఆస్పత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో 106 పోస్టులను భర్తీ చేస్తున్నారు. వీటి కోసం 8,309 మంది దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్, రోస్టర్ ప్రకారం ఈ పోస్టులను భర్తీ చేయాలి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రతి నియామకాన్ని అదే తరహాలో నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు ప్రజాప్రతినిధుల సిఫార్సులకే అధికారులు పెద్ద పీట వేస్తున్నారు.

సిఫార్సు లేఖకు రూ.3 లక్షలు?

స్టాఫ్ నర్స్ పోస్టుకు ధర భారీగా పలుకుతోంది. ఈ పోస్టులకు పోటీ ఎక్కువగా ఉంది. దీన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పైరవీలకు దిగారు. ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ పి.రాధారాణి ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన జరుగుతోంది. ఈ నెల 31లోగా పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయడానికి చర్యలు చేపట్టారు.

అధికారులపై ఒత్తిడి

ప్రజాప్రతినిధులందరూ సిఫార్సు లేఖలు ఇచ్చేస్తుండడం అధికారులకు తలనొప్పిగా మారింది. ఈ పోస్టుల భర్తీలో ఒత్తిడికి గురవుతున్నారు. కొంత మంది దరఖాస్తుదారులు సిఫార్సు లేఖలతో నేరుగా వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయ అధికారుల ముందు ప్రత్యక్షమవుతున్నారు. మరో వైపు సదరు ప్రజాప్రతినిధుల కార్యాలయాల నుంచి వీరికి ఫోన్లు మీద ఫోన్లు వస్తున్నాయి. దీంతో ఎవరి సిఫార్సులను అంగీకరించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

29న ప్రొవిజనల్ జాబితా

ఈ నెల 29న అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితా విడుదల చేయనున్నారు. ఈ జాబితా మీద మూడు రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 29న తుది జాబితా వెల్లడిస్తారు. 30 నుంచి మూడు రోజుల పాటు ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్, పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రంగంలోకి దళారులు

ఇప్పటికే దళారులు రంగప్రవేశం **చేశారు.** నిరుద్యోగులను మాయ మాటలతో నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే సిఫార్సు లేఖతోపాటు కార్యాలయంలో ఉన్న సిబ్బందితో బేరాలకు దిగుతున్నారు. కార్యాలయంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన ఉద్యోగులు ఉండటంతో వారి ద్వారా పోస్టుల భర్తీ సమాచారం తెలుసుకుని రేటు నిర్ణయిస్తున్నారు. పోస్టుకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుందని చెప్పి నిరుద్యోగుల్ని నమ్మించే పనిలో దళారులున్నారు.

దళారుల్ని నమ్మొద్దు



పారదర్శకంగా పోస్టుల భర్తీ జరుగుతుంది. అర్హత ప్రమాణాలు, మెరిట్, రోస్టర్ ప్రకారం ప్రొవిజినల్ జాబితా తయారు చేస్తున్నాం. ఇక్కడ సిఫార్సులకు తావులేదు. దళారులను నమ్మి మోస పోవద్దు.

– డాక్టర్ పి.రాధారాణి, ప్రాంతీయ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ, విశాఖపట్నం

వనాల ఏర్పాటుతో తీరప్రాంత పరిరక్షణ

షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్‌లో కలెక్టర్ హరేందిర ప్రసాద్



మెక్కలు నాటుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఏయూ క్యాంపస్: అలల తాకిడి సమయంలో తీర ప్రాంతం కోతకు గురవకుండా రక్షించేలా తీరం వెంబడి వనాలను పెంచాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ సూచించారు. బుధవారం ఆయన వీఎంఆర్‌డీఏ పార్కులో ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తులను తట్టుకునే గంగరావి, బాదం, సరుగుడు, రావి, మర్రి, కొబ్బరి జాతులకు చెందిన 1,200 మెక్కలను నాటనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను పరిరక్షిస్తూ, జీవవైవిధ్యం, గాలి, నీటి నాణ్యత పెంపొందించేందుకు ఇలాంటి వనాలు పెంచే కార్యక్రమం ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యంతోపాటు ప్రకృతిని సంరక్షించే కార్యక్రమాలను ప్రోత్సహిస్తామన్నారు. హరిత ప్రాంగణాలను పెంపొందించేలా ధాన్ ఫౌండేషన్‌తో ఈఎంఆర్‌డీఏ కలిసి పనిచేస్తుందన్నారు. నాటిన ప్రతి మెక్కను సంరక్షించే బాధ్యతను సాగర తీర కలంజియం సమాఖ్య చేపడుతుందన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ గ్రీన్ కవర్‌ను అర్బన్ ప్రాంతాలకు విస్తరించడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, డీఎఫ్‌వో శివాని తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు’ను ప్రైవేటీకరించట్లేదని ప్రకటించాలి

విశాఖ స్టీల్‌ప్లాంట్ జేఏసీ డిమాండ్



సంఘీభావం తెలుపుతున్న జేఏసీ నాయకులు

సీతంపేట: విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుత్తేజానికి రూ.11,440 కోట్లు విడుదలతో సరిపెట్టక, సొంత గనులు కేటాయించి, భవిష్యత్‌లో ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చెయ్యబోమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని విశాఖ స్టీల్ ప్లాంట్ జేఏసీ డిమాండ్ చేసింది. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జేఏసీ కన్వీనర్ లకే రాజారావు మాట్లాడారు. ఇంకా మొదలు పెట్టని నక్కపల్లి స్టీల్ ప్లాంట్‌కు ఇనుప గనులు కోసం ప్రయత్నిస్తున్న కేంద్రం, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేటాయించకపోవడం వెనుక కుట్రకోణం ఉందనే అనుమానాలు ఉన్నాయన్నారు. ప్రజా ఉద్యమం ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును మళ్లీ ప్రజా ఉద్యమం ద్వారానే పరిరక్షించుకోవాలన్నారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి, జిల్లా అధ్యక్షుడు పెదపెంకి శివప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకు రుణాలు ఎగ్గొట్టిన పారిశ్రామిక వేత్తలకు పదేళ్లలో రూ.14 లక్షల కోట్లు మాఫీ చేసిన కేంద్రం, స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న రూ.20 వేల కోట్ల అప్పును మాఫీ చెయ్యక పోవడం దారుణమన్నారు. బీసీ సంఘం నాయకుడు కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నష్టాలకు కార్మికులే కారణం అని బీజేపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారానికి స్వస్తి చెప్పి, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లనే లాభాల్లోంచి నష్టాల్లోకి వెళ్లిందన్న వాస్తవాన్ని గ్రహించాలన్నారు. ప్లాంట్ ఉద్యోగులకు వేతనాలు వెంటనే చెల్లించి, కొత్త కార్మికులను నియమించి పూర్తి స్థాయికి ప్లాంట్ సామర్థ్యం పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. సెయిల్‌లో విలీనం, సొంత గనులు కేటాయించేలా కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఎస్పీ ఆదివాసీ జేఏసీ చైర్మన్ రామారావు దొర, జేఏసీ ప్రతినిధులు కరణం తిరుపతిరావు, తాతారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్షలు



చినముషిడివాడ ఐయాన్ డిజిటల్ జోన్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల కోలాహలం

పెందుర్తి/అక్కిరెడ్డిపాలెం : విశాఖ జిల్లాలో జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. షీలానగర్‌లోని డిజిటల్ అయాన్, శొంఠ్యాంలోని ఎన్ఎస్ఆర్ఐటీ, చినముషిడివాడలోని ఐయాన్ డిజిటల్ జోన్ ఐడీజడ్–1, ఐడీజడ్–2 పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుంచే విద్యార్థులు బారులు తీరారు. ఆఖరి నిమిషాల్లో వచ్చిన అభ్యర్థులు కేంద్రంలోకి పరుగులు తీశారు. విద్యార్థులను పూర్తిగా చెకింగ్ చేసిన తరువాత కేంద్రంలోకి పంపించారు. షీలానగర్‌లోని డిజిటల్ అయాన్ కేంద్రంలో ఆలస్యంగా వచ్చిన దేవరాపల్లికి చెందిన డి.దుర్గాప్రసాద్‌ను అనుమతించలేదు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం నుంచి విచ్చేసిన దిలీప్ ఆధార్ కార్డు తేవకపోవడంతో అనుమతించలేదు. ఫోన్‌లో ఆధార్ కార్డు చూపించినా సెక్యూరిటీ సిబ్బంది కనికరించలేదు. దీంతో విద్యార్థి కన్నీటి పర్యంతమయ్యాడు. చినముషిడివాడ ఐయాన్ డిజిటల్ కేంద్రానికి దాదాపు 15 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన ముగ్గురు అభ్యర్థులను పరీక్షకు అనుమతించలేదు.



పరీక్ష హాల్ వివరాలు చూసుకుంటున్న విద్యార్థి



వడివడిగా.. పరుగెడుతూ..



సమయానికి చేరుకోలేక.. నిరాశగా కన్నీళ్లతో..

కంటి ఆస్పత్రిలో పిల్లల కోసం ఓపీ, ప్రత్యేక వార్డు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎస్సీపీసీఆర్) ఆదేశాలతో రామాటాకీస్ సమీపంలోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో పిల్లల కోసం ప్రత్యేకంగా ఓపీ కేంద్రం, తనిఖీ గది, ఆరు బెడ్లతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. దీనిని కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి, వైద్యురాలు జ్యోతిర్మయి, ఆర్ఎంవో నవీన్ కుమార్‌లతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా అన్ని జిల్లాల ప్రధాన ఆస్పత్రుల్లో పిల్లల కోసం ప్రత్యేక ఓపీ కేంద్రాలు, వార్డులు నెలకొల్పాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా గత నెలలో ఆస్పత్రి ఉన్నతాధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో బాలల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ కమిషన్ ఆదేశాల మేరకు పిల్లల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి పీఎంవోవో ఉమా శ్రీనివాస్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ రమణ కుమారి, బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు, చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం జిల్లా ప్రతినిధులు కె.ఎల్లయ్య, ఎం.హరీష్‌కుమార్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారితో కలిసి ఓపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సీపీసీఆర్ సభ్యుడు గొండు సీతారాం

జాతీయ రహదారిపై అంబులెన్స్ బోల్తా

- రోగి సహా ఆరుగురికి గాయాలు
- నర్సీపట్నం నుంచి ఆరిలోవ హెల్త్‌సిటీకి తరలిస్తుండగా పెందుర్తి వద్ద ఘటన
- డ్రైవర్ మినహా బాధితులంతా ఒకే కుటుంబ సభ్యులు



అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై బోల్తా పడిన అంబులెన్స్

పెందుర్తి: అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి/అత్తను కాపాడుకునేందుకు కొడుకులూ కోడళ్లు తాపత్రయపడ్డారు. తమ నివాస స్థలం నర్సీపట్నంలోని ఆస్పత్రిలో చేర్పించగా.. మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు చెప్పారు. దీంతో విశాఖ నగరానికి తీసుకెళ్లేందుకు ప్రైవేట్ అంబులెన్స్‌ను బుక్ చేశారు. ఆ అంబులెన్స్‌లో వస్తుండగా డివైడర్‌ను ఢీకొని అంబులెన్స్ బోల్తాపడటంతో రోగితోపాటు వెంట వెళ్లిన కొడుకులూ, కోడళ్లు, అంబులెన్స్ డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. అనకాపల్లి–అనందపురం జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలివి.. నర్సీపట్నం పట్టణానికి చెందిన గంటా చంద్రమ్మ(70) శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు సూచించడంతో ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో చంద్రమ్మను విశాఖ నగరంలోని ఆరిలోవ హెల్త్‌సిటీకి తరలించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అంబులెన్స్‌లో చంద్రమ్మ కుమారులు సూరిబాబు, పెద్దిరాజు, కోడళ్లు సర్వలక్ష్మి, జ్యోతి హెల్త్ సిటీకి వస్తున్నారు. అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిలో పెందుర్తి వద్దకు వచ్చేసరికి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను అంబులెన్స్ ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో చంద్రమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. సూరిబాబు, పెద్దిరాజు, సర్వలక్ష్మి, జ్యోతి సహా అంబులెన్స్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు 108లో క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం చంద్రమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పెందుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



108లో ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు



గాయపడిన చంద్రమ్మ, సర్వలక్ష్మి, జ్యోతి

ఘనంగా అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకుడు మొల్లి అప్పారావు తదితరులు

మహారాణిపేట: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలను మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. వేడుకల్లో పార్టీ జిల్లా కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, గొలగాని శ్రీనివాస రావు, పేర్ల విజయచందర్, నడింపల్లి కృష్ణంరాజు, బోని శివరామకృష్ణ, బొండా ఉమామహేశ్వరరావు, కె.రామన్నపాత్రుడు, అల్లంపల్లి రాజాబాబు, కెళ్ల సత్యనారాయణ, ముప్పల సురేష్, పల్ల దుర్గ, మధుపాడ రవికుమార్, బొండా శ్రీను, పత్తివాడు కనకరాజు, పీతల గోవిందు, దేవరకొండ మార్కండేయులు, పీలా ప్రేమ్‌కిరణ్, నాగేశ్వరరావు, ఉమ్మడి కల్యాణ్, పత్తివాడ వెంకటలక్ష్మి, మధు, సురేష్, కొండారెడ్డి, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కాలేజీలో జాబ్ మేళా రేపు

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కృష్ణా కాలేజీలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లానైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో టెక్విస్సేన్ సాఫ్ట్‌వేర్, డబ్ల్యూఎన్ఎస్, డా.రెడ్డి లేబొరేటరీస్, సంగీతా మొబైల్స్, ఎబీఎల్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ ప్రై.లి. కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇందులో 200 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌లో ఉద్యోగాలకు 2024లో ఇంటర్ ఎంపీసీ/బైపీసీ పూర్తి చేసిన 19–20 ఏళ్ల అభ్యర్థులు, టెక్విస్సేన్ సాఫ్ట్‌వేర్, డబ్ల్యూఎన్ఎస్, పీబీఎల్ ట్రాన్స్‌పోర్టు సంస్థలకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన యువతీయువకులు అర్హులుగా తెలిపారు. సంగీతా మొబైల్స్ ప్రై.లి.కు టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉత్తరాంధ్రలోని నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, హైదరాబాద్‌లలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9885694676 నంబరులో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు నైపుణ్యం వెబ్‌సైట్‌లో నేరుగా తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని సూచించారు.

30న కోరాపుట్ వరకే కిరండూల్

తాటిచెట్లపాలెం: కొత్తవలస–కిరండూల్ సెక్షన్ పరిధిలో జరుగుతున్న పలు ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ నెల 30వ తేదీన ట్రాఫిక్ కమ్ పవర్ బ్లాక్ తీసుకుంటున్నందున కిరండూల్ పాసింజర్ గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 30వ తేదీన విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ కోరాపుట్ నుంచి బయల్దేరుతుంది.

సమతా ఎక్స్‌ప్రెస్‌కు బిలోచ్‌పుర స్టేషన్‌లో హాల్ట్

విశాఖపట్నం–హజరత్ నిజాముద్దీన్–విశాఖపట్నం సమతా ఎక్స్‌ప్రెస్‌కు నార్త్ సెంట్రల్ రైల్వే, ఆగ్రా డివిజన్ పరిధిలో గల బిలోచ్‌పుర స్టేషన్‌లో హాల్ట్ ఇస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–హజరత్ నిజాముద్దీన్ (12807) సమతా ఎక్స్‌ప్రెస్‌కు మార్చి 16వ తేదీ నుంచి.. తిరుగు ప్రయాణంలో బయల్దేరే హజరత్ నిజాముద్దీన్ –విశాఖపట్నం(12808) సమతా ఎక్స్‌ప్రెస్‌కు మార్చి 15 వ తేదీ నుంచి హాల్ట్ ఇవ్వబడింది.

24 నుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ నేత మాధవ్

సీతమ్మధార: ఏయూ గ్రౌండ్స్‌లో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరగనున్న 43వ ఏబీవీపీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మహాసభల స్వాగత సమితి ప్రధాన కార్యదర్శి, బీజేపీ నేత పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్లో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాచంద్రతో కలిసి మీడియాతో మాట్లాడారు. 21 ఏళ్ల తర్వాత విశాఖలో ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి 2,500 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. యాచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి 7 నెలలు గడిచిన ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం లాంటి పలు విద్యారంగ సమస్యలపై తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు కిరణ్, జిల్లా కన్వీనర్ నితిన్, మహిళా కన్వీనర్ హరిచంద్రిక, ప్రసాద్, రాయుడు నితిన్, ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంటలో వ్యక్తి హత్య



మృతి చెందిన రాజు

ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): మామ, అల్లుడి మధ్య కొట్లాటను నిలువరించేందుకు వెళ్లిన వ్యక్తి హత్యకు గురయ్యాడు. మంగళవారం రాత్రి మండలంలోని చోడవరం పంచాయతీ ఎర్రగుంట గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ కన్నపరాజు కథనం మేరకు వివరాలు.. ఎర్రగుంట గ్రామంలో తుమ్మల సునీల్, అతని మామ పాడియం చినచెంచయ్య మధ్య గొడవ కొట్లాటకు దారితీసింది. అక్కడే ఉన్న వైజాగ్ రాజు (48) అనే వ్యక్తి కొట్లాటను ఆపేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో సునీల్ తన చేతిలో ఉన్న కర్రతో రాజు తలపై బలంగా కొట్టాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు నెల్లిపాకలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే రాజు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. విశాఖకు చెందిన రాజు ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం ఇక్కడికి వలస వచ్చాడు. వైద్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు కారకుడైన సునీల్ పరారీలో ఉన్నట్టు సీఐ తెలిపారు.